క్లుప్తంగా

బాడీబిల్డర్‌కు సత్కారం



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక: ఈ నెల 25 నుంచి 27 వరకు భిలాయ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన హరిప్రసాద్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఘనంగా సత్కరించారు. పాతకర్ణవానిపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరిప్రసాద్‌ను సత్కరించి, పోటీలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో న్యూ పెంటమాంబ జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డి, జాతీయ బాడీ బిల్డర్ నాగిరెడ్డి, బాలాజీ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా యూనియన్ల ప్రచారం



భెల్ టౌన్‌షిప్‌లో ప్రచారంలో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ గుర్తింపు యూనియన్ ఎన్నికలకు ప్రచారం జోరుగా సాగుతోంది. ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ మిత్రపక్షాలు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లి దేముడు, బోండా బాబూరావు, సుభాకర్ సాహు, ఎ.వెంకటరావు, జె.రాము, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణ ఆలయంలో శ్రమదానం



ఆలయ ప్రాంగణంలో వ్యర్థాలను తొలగిస్తున్న కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు ముసలినాయుడుపాలెంలోని వంశీకృష్ణ ఆలయ ప్రాంగణాన్ని ఆదివారం పరిశుభ్రం చేశారు. కొత్తగా ఎన్నికైన ఆలయ కమిటీ అధ్యక్షుడు కిల్లాన నాయుడు, కార్యదర్శి కోన అప్పారావు, చంటి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో శ్రమదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో రమణ, పైడిరాజు, ఉరుకూటి పైడిరాజు, దేవర చిన్నారావు, ఉరుకూటి అప్పలరాజు, సాగర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ది విశాఖపట్నం ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆదివారం ప్రారంభించారు. అనంతరం తమ అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణ, విధి విధానాలపై కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నూకేష్, కోశాధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమించి.. గెలుపు బాట

లాభాల్లో మహిళా రైతులు



మహిళా రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతులు

ఆకాశంలో సగం.. అవకాశంలో సగం అంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు మహిళలు. చదువుకుని, ఉన్నత స్థానాల్లో స్థిరపడిన మగువలు మనకు తారసపడుతూనే ఉంటారు, అయితే, చదువు లేకపోయినా మగవారితో సమానంగా పొలం పనులు చేస్తూ.. వ్యాపారాలు చేస్తూ ..కుటుంబానికి సహకారం అందిస్తున్నారు మరికొందరు అతివలు. శ్రామిక జీవన సౌందర్యానికి నిర్వచనంగా నిలుస్తున్నారు. ఆ కోవకే చెందినవారు గాజువాక మహిళా రైతుబజారులోని రైతులు.. వారిలో కొందరిని పలకరిస్తే తమ విశేషాలను తెలియజేశారిలా..

–గాజువాక



ఈమె పేరు యడ్ల వెంకట లక్ష్మి. తోటకూరపాలెంలో నాలుగు ఎకరాల రైతు. తమ పొలంలో వంకాయలు, బీరకాయలు, బరబాటి, కాకరకాయలు, ఆగాకర వంటి సంప్రదాయ కూరగాయలను పండిస్తారు. భర్త పూర్తి కాలం వ్యవసాయం చేస్తుంటారు. వెంకటలక్ష్మి ఆ కూరగాయలను ప్రతీ రోజు ఇక్కడి మహిళా రైతు బజారుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ అమ్మకాలు ముగిసిన తరువాత తిరిగి వెళ్లి మరుసటి రోజు కోసం కూరగాయలను సిద్ధం చేసుకుంటారు. తీసుకొచ్చిన కూరగాయలన్నీ అమ్ముడైతే ఖర్చులన్నీ పోయి వెయ్యి రూపాయల వరకు లాభం వస్తుంది.



ఈమె గుంటుబోయిన నూకాలమ్మ. కె.కోటపాడు మండలం గొల్లలపాలెంలోని తమ పొలంలో పండించిన పళ్లను ఇక్కడికి తీసుకొచ్చి మహిళా రైతుబజార్‌లో విక్రయిస్తుంది. సంప్రదాయ పద్ధతిలో పండే అన్ని రకాల పళ్లను తమ పొలంలో పండిస్తారు. భర్త ఆటో డ్రైవర్. అతని సహకారంతో రోజూ సుమారు 100 కేజీల పళ్లను ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తారు. ఐదేళ్లుగా ఆమె మహిళా రైతుబజార్‌లో ఈ వ్యాపారం చేస్తున్నారు. పళ్లను విక్రయించడం ద్వారా ఖర్చులు పోను రోజూ ఐదారు వందల రూపాయలు సంపాదిస్తున్నారు..



దాడి సన్యాసమ్మది చింతల అగ్రహారం గ్రామం. కొడుకు, కోడలు సహాయంతో ఆకు కూరలను పండిస్తుంది. గాజువాక మహిళా రైతు బజారులో సభ్యత్వం వచ్చినప్పటి నుంచి ఆమె క్రమం తప్పకుండా ఇక్కడికి ఆకు కూరలను తీసుకొచ్చి విక్రయిస్తుంది. అంతకుముందు కంచరపాలెం, బాజీ జంక్షన్, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లోని సంతలకు తీసుకెళ్లి విక్రయించేవారమని ఆమె తెలిపారు. ఇంటిల్లిపాదీ వ్యవసాయం చేసుకుంటామని, ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముకోవడంద్వారా తనకు సంతృప్తికరమైన మొత్తంలో లాభం వస్తుందని ఆమె చెబుతున్నారు.

గాజువాక మహిళా రైతు బజార్‌లో ఏ రైతును పలకరించినా ఈ తరహా విజయగాథలే వినిపిస్తాయి. తాము పండించుకున్న ఉత్పత్తులను నేరుగా తామే విక్రయించుకోవడం ద్వారా లాభాలను ఆర్జిస్తున్నారు మహిళా రైతులు. 2001లో ఏర్పాటు చేసిన గాజువాక రైతుబజార్‌ను 2013లో మహిళా రైతుబజార్‌గా మార్చారు. ఈ రైతు బజార్‌లో అన్ని రకాల కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరకులన్నీ అందుబాటులో ఉంటాయి. పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. దీంతో ధరలు కూడా అదుపులో ఉంటాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎంపిక చేసిన 35 మంది మహిళా రైతులు ప్రతీ రోజు ఇక్కడికి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు మొదలైనవి తీసుకొస్తారు. పండినవి ఏరోజుకారోజే తీసుకువస్తుండటంతో తాజాగా లభిస్తాయి.

కె.కోటపాడు (సంతపాలెం), దుంబ్రిగుడ, రావికమతం, మాకవరపాలెం, సబ్బవరం, కశింకోట, పెందుర్తి, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన రైతులు రోజూ కూరగాయలను తీసుకొచ్చి విక్రయిస్తారు. వీరితో పాటు గిరిజన ప్రాంతమైన అరకు నుంచి కూడా రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడికి తీసుకొస్తారు. ఈ రైతు బజార్‌లో గిరిజన ఉత్పత్తులను విక్రయించడం కోసం జీసీసీ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సూపర్‌బజార్‌కు చెందిన స్టాల్ కూడా వివిధ రకాల నిత్యావసర సరకులను అందుబాటులో ఉంచింది.

గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు తమ ఉత్పత్తులతో తెల్లవారుజాము మూడు, నాలుగు గంటలకల్లా రైతు బజార్‌కు వచ్చేస్తారు. కూరగాయలతో పాటు ఉల్లిపాయలు, బంగాళాదుంపలను భారీగా విక్రయిస్తారు. పప్పులు, బియ్యం, గిరిజన ఉత్పత్తులు విక్రయించే కౌంటర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు కొనుగోలుదారులు లేక బేలచూపులు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు కొనుగోలుదారులతో నిత్యం కిటకిటలాడే స్థాయికి చేరుకుంది. ఎందరో మహిళా రైతులకు ఆలంబనగా నిలుస్తోంది.

స్టీల్‌హౌస్‌లో ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్



ప్రథమ బహుమతి సాధించిన రమేష్‌కు అవార్డు అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి



ప్రథమ బహుమతికి ఎంపికైన అరకు లైఫ్‌స్టైల్ ఫొటో

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఫొటో ఎగ్జిబిషన్ ఆదివారం ముగిసింది. వరల్డ్ ఫొటోగ్రాఫిక్ డే సందర్భంగా స్టీల్‌ప్లాంట్, వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ సంయుక్తంగా ఉక్కుహౌస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు చక్కని స్పందన లభించింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి మాట్లాడుతూ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాలు సృజనాత్మకత ఉట్టిపడేలా ఉన్నాయన్నారు. తన కాలేజీ రోజుల్లో యషికా కెమెరాతో ఫొటోలు తీసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వాల్తేరు సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల అరకులో నిర్వహించిన ఫొటో వర్క్‌షాప్‌లో ప్రతిభ కనపరిచిన వి డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, బి.ఎస్.ఎస్.ఎస్. ప్రసాద్, కె.ధర్మరాజు, వి.వి. రామరాజు తీసిన ఫొటోలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన వివిధ రకాల కెమెరాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీసీ విభాగం జీఎం ఆర్.పి.శర్మ, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు పి.ఎస్.సేథ్, శ్రీనివాసరెడ్డి, జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాజువాక: ఆధునిక టెక్నాలజీ అభివృద్ధికి మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ చేసిన కృషి అజరామరమని కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పాత గాజువాకలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారతదేశాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణ, యరబాల భూలోక, ఉరుకూటి బాబూరావు, లక్కరాజు రామారావు, గుడివాడ శ్రీనివాసరావు, స్వర్ణ, మురళి, అలీ, రమణారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నడుపూరులోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెర్రిపోతుల ముత్యాలు తదితరులు నివాళులర్పించారు.

ఐక్య ఉద్యమాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



920వ రోజు ఉక్కు దీక్షలో నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోగలమని, అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన కార్మికుల నిరసన దీక్షలు ఆదివారానికి 920వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని విమర్శించారు. విదేశాల నుంచి నల్ల ధనాన్ని తీసుకువస్తానని చెప్పి బ్యాంకులను ఊడ్చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

లంకా మైదానంలో 'అనంత పంచముఖ గణేశుడు'

- భారీ గణపతి నమూనా విగ్రహం ఆవిష్కరణ



నమూనా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణి

గాజువాక : పాత గాజువాక లంకా మైదానంలో రూపు దిద్దుకొంటున్న భారీ గణపతి విగ్రహ నమూనాను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆదివారం ఆవిష్కరించారు. వచ్చేనెల 18 నుంచి ఇక్కడ నిర్వహించనున్న ఉత్సవాలకు రూపొందుతున్న విగ్రహానికి అనంత పంచముఖ గణేశునిగా నామకరణం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, సురేష్, ఇమ్రాన్, నిర్వాహకుడు గణేష్, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, యువశ్రీ, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గాజువాక: విద్యుత్ వినియోగదారులు ఆధార్ కార్డులను విద్యుత్ కనెక్షన్లకు అనుసంధానం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ విశాఖ–2 సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ కోరారు. దీనికోసం తమ ఆధార్ కార్డు జిరాక్స్‌ను విద్యుత్ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్లు తమ పూర్వీకుల పేరు మీద ఉంటే ప్రస్తుత వారసులు తమ వారసత్వానికి సంబంధించిన పత్రాలను,ఆధార్ కార్డులను దగ్గరలో కార్యాలయానికి అందజేసి పేరు మార్చుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులను మరింత సులభంగా చెల్లించడం కోసం గూగుల్ ప్లే స్టోర్‌లో ఈస్టర్న్ పవర్ యాప్‌ను డౌన్‌లో చేసుకోవాలని, అందులోని పే బిల్ ఆప్షన్‌ను ఉపయోగించి విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చన్నారు. ఈ అంశాలపై సందేహాలుంటే 1912 నంబర్‌కు డయల్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు



డివైడర్‌పై మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కూర్మన్నపాలెం: లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ గోపాలరావు పాల్గొన్నారు. ముందుగా అచ్యుతాపురంలోని కస్తుర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 240 మంది బాలికలకు కంటి పరీక్షలు చేశారు. అనంతరం దువ్వాడ ఫ్లైఓవర్ వద్ద ఉన్న డివైడర్‌పై 40 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప గవర్నర్లు ప్రసాద్, సూర్యప్రకాశరావు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'చలో గాజువాక' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేనేత సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: చేనేత కార్మికుల సమస్యలపై ఈ నెల 27న చేపట్టనున్న చలో గాజువాక సభను జయప్రదం చేయాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పెడన మాజీ మున్సిపల్ చైర్మన్ బండా ఆనంద్ భాస్కర్ కోరారు. 69వ వార్డు తుంగ్లాంలో మార్కండేయ యువజన సేవా సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం 'నేతన్నా మేలుకో మన హక్కుల సాధనకై ..' కార్యక్రమాన్ని చేనేత సంఘం ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాకలో నిర్వహించనున్న మహాగర్జన సభ సన్నాహక సమావేశంపై ఆనంద్ భాస్కర్ చర్చించారు. చేనేతలకు గుర్తింపు ఇవ్వాలని, రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం చలో గాజువాక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నావాన సింహాచలం, కొల్లి కుంచారావు, గిడితూరి అప్పారావు, ఎన్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



దాడుల్లో పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. గాజువాక శ్రీనగర్‌లోని అఫీషియల్ కాలనీ జాబిలి రెసిడెన్సీలోని ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఏసీపీ త్రినాథరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. పేకాడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.56,460 నగదును, 15 సెల్‌ఫోన్లను, 5 ద్విచక్రవాహనాలను, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను ఎస్‌హెచ్‌వో గాజువాక పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

జీవితాల్లో 'మార్పు' తెచ్చుకోండి

అల్లిపురం: జీవన విధానంలో మార్పు తెచ్చుకొని జీవితాలను ఉన్నతంగా మార్చుకోవాలని రౌడీ షీటర్లకు క్రైం డీసీపీ గంధం నాగన్న సూచించారు. టూటౌన్ దరి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉదయం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉండాలని, గత జీవితాన్ని మార్చుకుని కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రతిక్షణం మీరు చేసే పనులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, వారిపై రౌడీ షీట్ తొలగించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నగరంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మార్పు కార్యక్రమం ద్వారా నేరాలు చేస్తున్న వారి జీవితాల్లో మార్పు తీసురావాలనేది ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్రైం ఏసీపీ, టూటౌన్, మహారాణిపేట సీఐలు పాల్గొన్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్..

- ఫుట్ ఓవర్ వంతెనపై వాహనాలు నిలిపారా.. ఫైన్ కట్టాల్సిందే..
- దువ్వాడ రైల్వే స్టేషన్‌పై అధికారుల దృష్టి
- 196 వాహనాలపై కేసులు



ఫుట్ ఓవర్ వంతెనపై ఇలా పార్క్ చేస్తే పెనాల్టీ చెల్లించాల్సిందే..



ఎన్టీపీసీ క్రాసింగ్ వంతెన వద్ద కార్లు, ఆటోలను నిరోధిస్తూ ఏర్పాటు చేసిన ఐరన్‌పైప్‌లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఇకపై ఫుట్ ఓవర్ వంతెనపై వాహనాలు నిలిపితే భారీ మూల్యం చెల్లించుకోవల్సిందే. గత కొద్ది రోజులుగా ఆర్పీఎఫ్ అధికారుల పర్యవేక్షణలో అటువంటి వాహనాలకు చైన్‌లతో తాళాలు వేసేస్తున్నారు. అటువంటి వారు ఆర్పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి పెనాల్టీ చెల్లించి రసీదు తీసుకుంటే తప్ప వాహనాలకు మోక్షం కలగడం లేదు.

తఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్‌పై రెండు దశాబ్దాల క్రితం ఫుట్ ఓవర్ వంతెన నిర్మించారు. గతంలో ఇక్కడ కార్లు, ఆటోలు అనుమతించినా.. తరువాత మలుపు వద్ద ఆటోలు, కార్లు నిలిచిపోవడంతో పాటు మలుపు తిప్పడానికి ఇబ్బందులు ఎదురవడంతో కేవలం ద్విచక్రవాహనాలు, పాదచారులనే అనుమతిస్తున్నారు. అయితే.. ఫ్లైఓవర్ వంతెనకు సమీపంలో లేదా వంతెన కింది వైపున ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు పార్క్ చేసినా పార్కింగ్ ఫీజు చెల్లించాల్సి రావడంతో ప్రయాణికులు, వారిని సాగనంపడానికి వచ్చే ద్విచక్ర వాహనచోదకులు వంతెనపై వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో అటువంటి వాహనాలపై ఆర్పీఎఫ్ అధికారులు దృష్టి సారించారు. రెండు రోజుల్లో ఆర్పీఎఫ్ సీఐ రాము ఆధ్వర్యంలో దాడులు చేసి 196 వాహనాలకు తాళాలు వేసి రూ.88 వేల 8వందల జరిమానా విధించారు. అలాగే స్టేషన్‌లో రైలు దిగే ప్రయాణికులను కూడా టీటీఈలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ప్లాట్‌ఫామ్ టికెట్ లేకపోయినా జరిమానా చెల్లించాల్సి వస్తోంది.

ప్రయాణికులు సహకరించాలి

వాహనాల పార్కింగ్ విషయంలో ప్రయాణికులు సహకరించాలి. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ద్విచక్రవాహనాలు పార్క్ చేయాలనుకుంటే రూ.పది చెల్లించి పార్కింగ్ ప్రదేశంలో పార్క్ చేయాలి. లేదంటే 5 వందల నుంచి వెయ్యి రూపాయల వరకు పెనాల్టీ చెల్లించాలి. వాహనాల భద్రత, ప్రయాణికుల సౌకర్యానికనుగుణంగా తీసుకుంటున్న నిర్ణయాలకు అందరూ సహకరించాలి.

– రాము, ఆర్పీఎఫ్ సీఐ

సింహాచలేశుడికి ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్ఠింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.